నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, మంగళవారం 17 డిసెంబర్ 2024 | KAMAREDDY

జీజీహెచ్‌లో సమస్యల తిష్ట

- అందుబాటులో లేని మందులు
- బయట కొనుగోలు చేస్తున్న రోగులు
- హాస్పిటల్‌లో వెక్కిరిస్తున్న ఖాళీలు
- ఏడాదిలో నిర్వహణ అస్తవ్యస్తం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు

ఒకప్పుడు రోగులకు మెరుగైన వైద్యసేవలందించి, రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందిన నిజామాబాద్ జిల్లా కేంద్ర ప్రభుత్వ దవాఖాన ప్రస్తుతం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నది. బీఆర్ఎస్ హయాంలో అన్ని వసతులు కల్పించడంతో జీజీహెచ్‌కు ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి రోగులు వచ్చేవారు. గత కేసీఆర్ సర్కార్ ప్రజావైద్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో ప్రజలకు ప్రభుత్వ దవాఖానలపై నమ్మకం ఏర్పడింది. దీంతో జిల్లా కేంద్ర దవాఖానకు నిత్యం వేల సంఖ్యలో రోగుల తాకిడి ఉండేది. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో దవాఖానల్లో గడ్డు పరిస్థితులు నెలకొన్నాయి. ఒకవైపు మందులు, మరోవైపు దవాఖానలో వైద్య సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తున్నది. ప్రభుత్వ ఉదాసీన వైఖరితో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

-ఖలీల్‌వాడి, డిసెంబర్ 16

జీజీహెచ్‌లో టోకెన్ కోసం బారులు తీరిన రోగులు

నిరంతరం తాగునీటి సమస్య..

జీజీహెచ్‌లో తాగునీటి సమస్య నిరంతరంగా కొనసాగుతున్నది. బోరు పనిచేయకపోవడంతో తాగునీరు అందుబాటులో లేదని అధికారులు తెలుపుతున్నారు. దీంతో రోగులు, వారితో ఉండే కుటుంబీకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యలపై దవాఖాన సూపరింటెండెంట్‌ను వివరణ కోరేందుకు ఫోన్ చేయగా స్పందన కరువైంది.

మందులు బయట కొనాల్సిందే..

ఏడంతస్తుల మేడ.. అన్ని కరువే..

ఏడంతస్తుల మేడలో ఏర్పాటు చేసిన జిల్లా ప్రభుత్వ దవాఖానకు నిత్యం వేల సంఖ్యలో అవుట్ పేషెంట్లు వస్తుంటారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జీజీహెచ్‌లో నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. రోగులకు మెరుగైన వైద్యం అటుంచితే.. దగ్గు, జలుబు, జ్వరాలకు మందులు ఇచ్చే పరిస్థితి లేదు. వచ్చిన రోగులకు వైద్య సేవలు అందించేందుకు సరిపడా వైద్య సిబ్బంది లేకపోవడం గమనార్హం. ఒకప్పుడు ఇక్కడ పదుల సంఖ్యలో సీనియర్ వైద్యులు ఉండేవారు. ప్రభుత్వం 18 మంది ప్రొఫెసర్లను బదిలీ చేయడంతో వైద్యుల కొరత తీవ్రంగా వేధిస్తున్నది. ఫలితంగా రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం పీజీ డాక్టర్లతోనే వైద్యం అందిస్తున్నారు. ఉన్న కొద్దిమంది సీనియర్లు ఉన్నా దవాఖానలో సరైన సదుపాయాలు లేకపోవడంతో పూర్తిస్థాయిలో వైద్య సేవలందించని పరిస్థితి నెలకొన్నది.

నిరుపయోగంగా అత్యాధునిక పరికరాలు..

జిల్లా ప్రభుత్వ దవాఖానలో మందుల కొరత వేధిస్తున్నది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రతి రోగానికి మందులు అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం ఇండెంట్ పెట్టినా రాని పరిస్థితి. వైద్యులు రాసిన మందులు కూడా అందుబాటులో ఉంచలేకపోతున్నారు. న్యూరో, గైనిక్, బీపీ, థైరాయిడ్‌కు తదితర మందులు అందుబాటులో లేకపోవడంతో బయటికి వెళ్లి కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొన్నది.

గతమంతా వైభవమే ..

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పేదలకు అన్ని రకాల వైద్యసేవలు అందించాలని ఉద్దేశంతో జీజీహెచ్‌లో కోట్ల రూపాయలు వెచ్చించి అత్యాధునిక పరికరాలను అందుబాటులోకి తెచ్చింది. ఏ ఒక్క రోగి హైదరాబాద్‌కు వెళ్లకుండా ఇక్కడే కార్పొరేట్‌కు దీటుగా వైద్య సేవలు అందించింది. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఏడాదికాలంగా జీజీహెచ్‌పై నీలినీడలు కమ్ముకున్నాయి. ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం వహించడమే కాకుండా ప్రభుత్వ దవాఖానల్లో నిర్వహణను గాలికొదిలేసింది. ఇప్పటివరకు జీజీహెచ్‌లో సౌకర్యాల కల్పనపై దృష్టిసారించిన దాఖలాలు లేవు. మందులు, వైద్య సిబ్బంది కొరత వేధిస్తున్నా జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం గమనార్హం.

పేదలకు ఒకేసారి అన్ని రకాల టెస్టులు చేసేందుకు కేసీఆర్ ప్రభుత్వం టీ-హబ్ అత్యాధునిక పరికరాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. వందలాది మందికి రక్తనమూనా పరీక్షలు నిర్వహించారు. కానీ ప్రస్తుతం కొన్ని పరీక్షలకు మాత్రమే రక్తనాముూనా సేకరణ చేస్తున్నారు. క్యాథ్‌ల్యాబ్, సిటీస్కాన్, టీఫా స్కానింగ్ తదితర పరికరాలు జీజీహెచ్‌లో ఉన్నప్పటికీ వైద్యుల కొరతతో అవి నిరుపయోగంగా మారిపోయాయి. ఇటు ప్రభుత్వ దవాఖానల్లో వైద్యపరీక్షలు, వైద్యం అందకపోవడం, అటు ప్రైవేట్ దవాఖానల్లో ఇష్టం వచ్చినట్లు ఫీజులు వసూలు చేస్తుండడంతో పేదలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

దవాఖానలో ఖాళీల వివరాలు

పోస్టు పేరు	మొత్తం	రెగ్యులర్	కాంట్రాక్ట్	ఖాళీలు
ప్రొఫెసర్	38	21	1	16
అసోసియేట్ ప్రొఫెసర్	63	13	6	44
అసిస్టెంట్ ప్రొఫెసర్	147	61	48	38
ట్యూటర్	23	9	11	3
సీఏఎస్	10	0	3	7
మొత్తం	281	104	69	108

గురుకులాల్లో లోపించిన నాణ్యత

- అందుకే తరచూ ఫుడ్ పాయిజన్ ఘటనలు
- విదేశీ విద్యా పథకానికి నిధుల కేటాయింపేది?

ప్రభుత్వానికి ఎమ్మెల్సీ కవిత సూటిప్రశ్న

ఏడాది వ్యవధిలోనే గురుకులాల్లో నాణ్యత పూర్తిగా తీసికట్టుగా మారిందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఫలితంగా రోజూ ఫుడ్ పాయిజన్ ఘటనలు చోటు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ విద్యార్థుల విదేశీ విద్యకు సంబంధించి నిధులు ఎందుకు ఇవ్వడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శాసనమండలిలో సోమవారం కవిత మాట్లాడుతూ గురుకులాల్లో నెలకొన్న సమస్యలను ప్రస్తావించారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి 2014 వరకు తెలంగాణలో కేవలం 19 బీసీ వెల్ఫేర్ స్కూళ్లు ఉంటే, కేసీఆర్ పదేండ్ల పాలనలో 275 బీసీ పాఠశాలలను ఏర్పాటు చేశామని వివరించారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత 31 బీసీ డిగ్రీ కళాశాలలు, రెండు బీసీ అగ్రికల్చరల్ కాలేజీలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. అలాగే, కేసీఆర్ హయాంలో రూ.14 వేల కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం వెచ్చించామని, దీనివల్ల 15 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరిందన్నారు. విదేశీ విద్యా పథకం కింద 2,233 మందికి రూ.450 కోట్లు వెచ్చించామన్నారు. పెద్ద కాంట్రాక్టర్లకు రూ.10 వేల కోట్లు చెల్లించామంటున్న ప్రస్తుత ప్రభుత్వం.. బీసీ విద్యార్థుల విదేశీ విద్యకు ఎందుకు నిధులు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో ఏడాదికి 27 బీసీ గురుకులాలు నెలకొల్పామని, కానీ ప్రస్తుత ప్రభుత్వం ఒక్క గురుకుల ఏర్పాటుకు ముందుకు రాకపోవడం దారుణమన్నారు. గురుకులాల్లో మెనూ ఏర్పాటు చేశామని చెప్పారని, కానీ అమలు కావడం లేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఎప్పటి నుంచి మెనూను అమలు చేస్తారో చెప్పాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గిరిపుత్రులకు ప్రభుత్వం చేయూతనివ్వాలని కవిత కోరారు. హనీ బీ కాలనీల ఏర్పాటుకు చొరవ తీసుకోవాలని సూచించారు. పట్టు పరిశ్రమకు వినియోగించే మల్బరీ సాగును ప్రోత్సహించాలన్నారు. సెరీకల్చర్ డిపార్ట్‌మెంట్‌లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. నేతన్నలు కట్టిన జీఎస్టీని తిరిగి ఇవ్వాలని ప్రభుత్వానికి సూచించారు.

కామారెడ్డిలో రోడ్లపై ముగ్గులు వేసి, ప్లకార్డులు చేతబట్టి నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెను ఉధృతం చేస్తాం..

సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల హెచ్చరిక

నిజామాబాద్‌లో చెవిలో పువ్వులు పెట్టుకొని, కామారెడ్డిలో ముగ్గులు వేసి నిరసన

కంఠేశ్వర్/ కామారెడ్డి, డిసెంబర్ 16 : రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలను వెంటనే పరిష్కరించకుంటే విద్యార్థులతో సహా రోడ్లపై బైఠాయించి సమ్మెను ఉధృతం చేస్తామని సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు హెచ్చరించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ వారు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతున్నది. సమ్మెలో భాగంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్ వద్ద సోమవారం చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలుపగా.. కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం ఎదుట మహిళా ఉద్యోగులు ముగ్గులు వేసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం నిజామాబాద్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజు, భూపేందర్ మాట్లాడుతూ.. పది రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. నిజామాబాద్‌లో చేపట్టిన సమ్మె శిబిరంలో ధర్మ టీచర్స్ యూనియన్ జిల్లా నాయకులు బాగేంద్ర మహరాజ్, రాజు, రమేశ్, ప్రవీణ్ మహరాజ్, సంతోష్, నాయకులు హరిచరణ్, దేవానంద్, నర్సింహరావు, నవీన్, శ్రీనివాస్, శేఖర్, విజయ్, గంగామణి, ప్రకాశ్, అఫ్సర్, రవికిరణ్, జాన్ సత్యపాల్, రాణి, సుప్రజ, పద్మ, కామారెడ్డిలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి సంపత్, మహిళా అధ్యక్షురాలు వాసంతి, హరిప్రియ, కాళీదాస్, శైలజ, వనజ, రాజు పాల్గొన్నారు

ఎట్టకేలకు కదిలొచ్చిన యంత్రాంగం

మోర్తాడ్ శివారుల్లోని ఇసుక డంప్‌ల సీజ్

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

మోర్తాడ్, డిసెంబర్ 16: గాండ్లపేట్ పెద్దవాగు నుంచి కొన్నిరోజులుగా ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతున్నది. అధికార పార్టీ అండదండలతో అక్రమార్కులు రాత్రివేళ పెద్దవాగును తోడేస్తున్నారు. వీడీసీ, అధికారులకు ముడుపులు చెల్లిస్తూ యథేచ్ఛగా తవ్వకాలు చేపడుతూ వ్యవస్థలకు సవాల్ విసురుతున్నారు. ఇసుక దోపిడీపై 'నమస్తే తెలంగాణ'లో వరుస కథనాలు ప్రచురితమవుతుండడంతో అధికారులు స్పందించారు. అక్రమంగా తరలించి మోర్తాడ్ శివారుల్లో ఏర్పాటు చేసిన ఇసుక డంప్‌లను సోమవారం సీజ్ చేసినట్లు తహసీల్దార్ సత్యనారాయణ తెలిపారు. వివిధ ప్రాంతాల్లో దాదాపు 200కుపైగా ట్రాక్టర్ల ఇసుక డంప్‌లను సీజ్ చేశామని చెప్పారు. ఇందుకు సంబంధించిన నివేదికను కలెక్టర్‌కు పంపించామని, సీజ్ చేసిన ఇసుకను త్వరలోనే నిబంధనల మేరకు తరలిస్తామని తెలిపారు.

ఇసుక డంప్‌లను సీజ్ చేస్తున్న అధికారులు

పింఛన్లు పెంచాలని ధర్నా

- మాక్లూర్‌లో టీయూసీఐ ఆధ్వర్యంలో బీడీ కార్మికుల ర్యాలీ
- కొత్త పింఛన్లు ఇవ్వాలని పొతంగల్‌లో ఆందోళన

మాక్లూర్/పొతంగల్, డిసెంబర్ 16: బీడీ కార్మికులకు రూ. 4వేల జీవనభృతి వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మాక్లూర్‌లో టీయూసీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టగా..కొత్త పెన్షన్లు మంజూరుచేయాలని కోరుతూ పొతంగల్‌లో గ్రామస్తులు సోమవారం ధర్నా నిర్వహించారు. మాక్లూర్‌లో టీయూసీఐ (ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా) నాయకులు బీడీ కార్మికులతో కలిసి తహసీల్ ఆఫీస్ వరకు ర్యాలీ చేపట్టి ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ శేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ మాట్లాడుతూ..బీడీ కార్మికులకు గతంలో నెలకు 26 రోజుల పని దొరికేదని, ప్రస్తుతం నెల కు 8 నుంచి 12 రోజులు పని మాత్రమే దొరుకుతున్నదని చెప్పారు. మోదీ ప్రభుత్వం బీడీ పరిశ్రమపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీడీ కార్మికులకు రూ. నాలుగు వేల జీవనభృతి ఇస్తామని హామీ ఇచ్చి ఏడాది గడుస్తున్నా, ఇంతవరకు అమలుచేయడంలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతినిధులు రాజేశ్వర్, నాయకులు కిష న్, సాయిరెడ్డి, మురళి, గంగాధర్, సుజాత, లావణ్య, లక్ష్మీ, సరోజ, నందిని, రజిత, జమున, సుశీల పాల్గొన్నారు.

పొతంగల్‌లో..

కొత్త పింఛన్లను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ పొతంగల్ బస్టాండ్ వద్ద గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ప్రజాప్రతినిధి బజరంగ్ హన్మాండ్లు మాట్లాడుతూ.. ఆసరా పింఛన్ల కోసం ఏండ్లుగా ఎదురుచూస్తున్నా మంజూరు చేయడం లేదని మండిపడ్డారు. సూదం శంకర్, గంధం హన్మాండ్లు, రమేశ్, వెంకట్ రావు, తుకారాం తదితరులు పాల్గొన్నారు.

మాక్లూర్ మండలం మాదాపూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న టీయూసీఐ నాయకులు, బీడీ కార్మికులు

సైబర్ క్రైం కేసుల పరిష్కారంలో

జిల్లాకు ఐదో స్థానం

ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ వెల్లడి

వినాయక్‌నగర్, డిసెంబర్16: సైబర్ నేరాల కేసులను జాతీయ లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించి, నిజామాబాద్ జిల్లా రాష్ట్రస్థాయిలో ఐదోస్థానంలో నిలిచిందని ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ సోమవారం తెలిపారు. నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో కొంతకాలంగా సైబర్ నేరాల కేసులు పరిష్కారం కాకుండా కోర్టులు, బ్యాంకుల్లో పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. అలాంటి 174 కేసుల్లో ఫిర్యాదుదారులకు మొత్తం రూ.71,52, 505 ఇప్పించినట్లు పేర్కొన్నారు. సైబర్ మోసగాళ్ల చేతిలో మోసపోకుండా జాగ్రతలు పాటించాలని సూచించారు. లోన్ యాప్‌లకు దూరంగా ఉండాలని, కస్టమర్ కేర్ నంబర్లను గూగుల్‌లో వెతకరాదన్నారు. అపరిచిత నంబర్ల నుంచి ఫేస్‌బుక్, వాట్సాప్ ద్వారా వచ్చే వీడియో కాల్స్‌కు స్పందించకూడదని తెలిపారు. వ్యక్తిగత వివరాలను ఎవరికీ తెలియజేయవద్దన్నారు. ఎవరైనా మోసం చేస్తే వెంటనే గోల్డెన్ అవర్‌లో 1930 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.

ముగిసిన గ్రూప్-2 పరీక్షలు

కామారెడ్డిలో ఓ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్

కంఠేశ్వర్/ కామారెడ్డి/ వినాయక్‌నగర్, డిసెంబర్ 16 : ఉమ్మడి జిల్లాలో రెండు రోజులపాటు నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. నిజామాబాద్ జిల్లాలో సోమవారం ఉదయం సెషన్‌లో నిర్వహించిన పరీక్షకు మొత్తం 19,855 మంది అభ్యర్థులకు 8,915 మంది హాజరు కాగా 10,940 మంది, మధ్యాహ్నం రెండో సెషన్‌లో 19,855 మంది అభ్యర్థులకు 8,911 హాజరు కాగా 10,944 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. కామారెడ్డి ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ తనిఖీ చేశారు. రెండోరోజు అభ్యర్థుల హాజరు వివరాలను అధికారులను అడుగగా.. తమకు టీజీపీఎస్సీ నుంచి ఎలాంటి వివరాలూ చెప్పొద్దని ఆదేశాలు వచ్చాయని సమాధానం ఇవ్వడం గమనార్హం. ఆదివారం జరిగిన పరీక్ష కన్నా సోమవారం నిర్వహించిన పరీక్షకు తక్కువ మంది అభ్యర్థులు హాజరైనట్లు సమాచారం. కామారెడ్డి ఎస్పీ, నిజామాబాద్ ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ ఆదేశాల మేరకు అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 163 సెక్షన్‌ను అమలుచేసి, గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు.

డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో టీయూ పీడీఎస్‌యూ నాయకులు

అరెస్టుల పర్వం

- 'అసెంబ్లీ ముట్టడి' భగ్నం
- ఉమ్మడి జిల్లాలో మాజీ సర్పంచుల నిర్బంధం
- పీడీఎస్‌యూ నాయకుల అరెస్టు
- పోలీసు స్టేషన్లకు తరలింపు

డిచ్‌పల్లి/జక్రాన్‌పల్లి, డిసెంబర్ 16 : విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సోమవారం తలపెట్టిన 'చలో అసెంబ్లీ' కార్యక్రమాన్ని పోలీసులు భగ్నం చేశారు. జక్రాన్‌పల్లి మండలం అర్గుల్, తెలంగాణ యూనివర్సిటీ పీడీఎస్‌యూ నాయకులను అరెస్టు చేసి స్థానిక పోలీసు స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నదని మండిపడ్డారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంలో విఫలమైందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా ఇప్పటికీ విద్యాశాఖ మంత్రిని నియమించలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు.

బోధన్‌రూరల్/ మాచారెడ్డి/ మద్నూర్, డిసెంబర్ 16: తమ హయాంలో గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మాజీ సర్పంచులు సోమవారం తలపెట్టిన 'అసెంబ్లీ ముట్టడి' కార్యక్రమాన్ని ఉమ్మడి జిల్లాలో పోలీసులు భగ్నం చేశారు. మాజీ సర్పంచులను నిర్బంధించారు. బోధన్,మద్నూర్, మాచారెడ్డి తదితర మండలాల్లోని పలువురు మాజీ సర్పంచులను వేమువజామున ముందస్తుగా అరెస్టు చేసి పోలీసు స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచులు మాట్లాడుతూ.. బిల్లులు చెల్లించాలని కోరితే అరెస్టు చేస్తారా అంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తంచేశారు.

మాచారెడ్డి పోలీసుల అదుపులో మాజీ సర్పంచులు